# తనదాకా వస్తే

ఎ. రంగ



"పైడితల్లీ! నువ్వెప్పుడూ ఎవరూ లేకుండా చూసి పాలు తీస్తావు. ఆ తీసిన పాలుకూడా ఎవరూలేకుండాచూసి. కొంగు మూతకప్పి పట్టుకెళతావు రహస్యంగా. ఎందుకలా చేస్తావ్?" పైడితల్లిని అడిగింది రాధ.

"నరుడి కంటపడితే నల్లరాయి బద్దలవుద్దమ్మాయ్‌గోరూ! మీకు తెల్దుకాని ఒకోసారి కన్నడిందంటే గేదెలు పాలు సరిగా ఇయ్యవమ్మాయ్‌గోరూ! పాలు తగ్గిపోతాయి దిష్టి అమ్మాయ్‌గోరూ! దిష్టి." అంది పైడితల్లి. "ఏం, నరుడి కళ్ళల్లో డైనమైటుందేమిటి? నల్లరాయి బద్దలవటానికి. అదంతా మీ చాదస్తం. మీ మూఢనమ్మకం కాని" అంది రాధ పైడితల్లిని కొట్టిపారేస్తూ.

"సదువుకున్నోరు. మీకలాంటియ్ అరదంగావు. దిష్టిదోషంవుంటుందమ్మాయ్‌గోరూ" అంటూ పైడితల్లి రాధని నవ్వుతూ కొట్టిపారేసింది. పాలు మూతపెట్టి లోపలకు తీసుకుపోయింది. రాధ నవ్వుకుంటూ మనిషి మూర్ఖత్వానికి మరోసారి బాధపడుతూ లోపలకు వెళ్ళిపోయింది.

* * *

ఆ రోజు రాధ ఏదీగాని వేళ తలంటుపోసుకుంది. డాబామీద చల్లనిగాలిలో వాలు కుర్చీలో పడుకుంది. లేత గులాబీ రంగు సిల్కు చీరలో మృదువుగా, అందంగావున్న రాధ నీలాకాశంలో హడావిడిపడుతున్న నల్లని మేఘాలని చూస్తూ, ఆ చల్లని ఆహ్లాద వాతావరణాన్ని అనుభవిస్తోంది. గాలి హుందాగా, చల్లగా శరీరాన్ని తాకుతూ ఏదో తెలియని హాయినిస్తోంది.

ఇంతలోనే విజయ వచ్చింది.

"ఇదేమిటి? ఈ రోజు మరీ ఇంత అందంగా కనిపిస్తున్నావ్! దిష్టి తగిలేటట్లు! ఈ వేషంగా ఎవరైనా పెళ్ళికొడుకు వచ్చి నిన్ను చూట్టం జరిగితే, వదిలిపెడతాడన్నది అబద్ధం." అప్రస్తుత విషయాలు హడావిడిగా, గబగబా మాట్లాడటం విజయకు అలవాటయిన విషయంగా రాధ బాగా ఎరిగిన కారణంగా, బదులుగా రాధ చిన్నగా నవ్వుతూ "ముందు కూర్చో" అంటూ కుర్చీ చూపించింది విజయకు. కాసేపు అవీ ఇవీ మాట్లాడుకున్నాక రాధ ఇచ్చిన టీ తాగి వెళ్ళిపోయింది విజయ.

గాలిలో తేమని భరించలేక కిందకు వచ్చిన రాధ ముసుగుతన్ని పడుకుంది. దీపాలు వెలిగేయి.

"అమ్మాయ్ రాధా! భోజనానికి రా!" అంటూ రాధ తల్లి పిలిచింది.

"నాకు జ్వరం తగిలిందమ్మా! భోజనం చేయను. మిరియాల పాలు పంపు" అంటూ మళ్ళా ముసుగులో దూరింది రాధ.

"అయ్యో తల్లి! ఇప్పటివరకూ బాగానే వున్నావు కదటే! ఇంతలో ఏం కొంప మునిగిపోయిందే తల్లీ! బైటికయినా వెళ్ళలేదు దిష్టి తగిలేందుకు. అన్నట్లు ఇందాక విజయ వచ్చినట్లుంది కదూ? దాని కళ్ళు ఎప్పుడూ నీ మీదనే వుంటాయి. నరుడి కంటపడితే నల్లరాయి బద్దలవుతుందంటారు. వుండు. ముందు మిరపకాయలు, ఉప్పు దిగతుడిచి పారేసి, పాలు ఇస్తాను" అంటూ హడావిడిగా, కంగారుగా లోపలకు వెళ్ళింది రాధ తల్లి.

"చాలా రోజులకు ఏదీ కాని వేళ, చాలాసేపు చన్నీళ్ళతో తలంటుపోసుకున్న కారణంగా ఒళ్ళు అలసి, నలవరం వచ్చిందమ్మా! దిష్టికాదు." అని చెప్పటానికి బదులుగా బుద్ధిగా మిరపకాయలు-ఉప్పు దిష్టి తీయించుకుంది రాధ.

"దిష్టి"ని ఒకరి విషయంలో మూఢనమ్మకంగా కొట్టిపారేయగలిగి, తన దాకా వచ్చే సరికి కొట్టిపారేయలేని బలహీనతతో రాధ-దిష్టి తీయించుకుంటుంటే— పైడితల్లి నవ్వుతోంది అదోలా!

